క్లుప్తంగా

స్నేహానికన్న మిన్న లోకాన లేదురా..



ఆర్థిక సాయమందిస్తున్న సహచరులు

మార్టూరు: అవసరానికి అయిన వారే మొహం చాటేస్తున్న నేటి సమాజంలో తమతో కలిసి 30 ఏళ్ల క్రితం చదువుకున్న బాల్య స్నేహితుడు ఆపదలో ఉంటే మేమున్నామంటూ నాటి సహచర విద్యార్థులు ఆసరాగా నిలిచారు. మండలంలోని రాజుపాలేనికి చెందిన సూరేపల్లి శ్రీనివాసరావు మార్టూరులోని మద్ది సత్యనారాయణ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1992–93లో 30 ఏళ్ల క్రితం 10 వతరగతి చదువుకున్నాడు. ఇటీవల శ్రీనివాసరావు కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న నాటి సహచర విద్యార్థులు తమ వంతు సాయంగా రూ. 53 వేలు వసూలు చేసి సోమవారం శ్రీనివాసరావు కుటుంబానికి అందజేసి తామున్నామంటూ ధైర్యం చెప్పారు.

ఓపెన్ స్కూల్ తరగతులకు హాజరు తప్పనిసరి



తరగతులను పరిశీలిస్తున్న సమన్వయకర్తలు

చీరాల అర్బన్: ఓపెన్ స్కూల్ తరగతులకు వచ్చే వారికి హాజరుశాతం తప్పనిసరిగా ఉండాలని రాష్ట్ర సమన్వయకర్తలు ఎం.శ్రీనివాసరావు, ఎం.నరసింహారావులు అన్నారు. ఆదివారం స్థానిక సెయింట్ మార్క్స్ లూథరన్ జూనియర్ కాలేజీలోని ఓపెన్ స్కూల్ సెంటర్‌ను వారు పరిశీలించారు. తరగతులకు వచ్చే వారు క్రమం తప్పకుండా రావాలని, హాజరుశాతం తక్కువగా ఉంటే పరీక్షలకు అనుమతించమన్నారు. ఇదే విషయాన్ని జిల్లా విద్యాశాఖాధికారి పీవీజే రామారావు, జిల్లా సమన్వయకర్త బి.శ్రీనివాసులరెడ్డిలకు సమాచారం ఇచ్చామన్నారు. కార్యక్రమంలో జిల్లా సిబ్బంది సైకం శ్రీనివాస్, కో–ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

వరిగడ్డి వామి దగ్ధం



మంటలను అదుపులోకి తెస్తున్న ఫైర్ అధికారులు

బల్లికురవ: దీపావళి వేడుకల్లో భాగంగా ప్రమాదవశాత్తు వరిగడ్డి వామిలో మంటలు చెలరేగటంతో గడ్డివామి దగ్ధమైంది. ఈఘటన ఆదివారం చెన్నుపల్లిలో జరిగింది. అందిన సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన కోనంకి వాసు దక్షిణం వైపున 5 ఎకరాల్లో వరిగడ్డి వాము వేశారు. వామి లోపల నుంచి పొగలతో మంటలు రావటాన్ని సమీపంలో ఉన్న వారు గుర్తించి రైతుకు సమాచారం అందించారు. రైతులతోపాటు గ్రామస్తులు మంటలను అదుపు చేయాలని ప్రయత్నించినా అదుపులోకి రాలేదున అద్దంకి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. ఫైర్ అధికారి ఆంజనేయులు సిబ్బందితో ప్రమాద స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. రూ.50 వేల విలువజేసే పశుగ్రాసం ఆహుతైందని బాధిత రైతు వివరించారు.

వెలుగుల దీపావళి.. సంతోషాల జాబిలి



చినగంజాంలో దీపావళి దివ్వెలు వెలిగిస్తున్న చిన్నారులు



మేదరమెట్లలో దీపావళి పండుగ జరుపుకుంటున్న ఓ కుటుంబం



వెలమవారిపాలెంలో టపాసులు కాల్చుతున్న ప్రజలు

- ఘనంగా దీపావళి పండుగ
- వీధివీధినా దీపాల వెలుగులు
- బాణసంచాతో హోరెత్తిన వీధులు



పర్చూరు జయంతి పేటలో పండుగను జరుపుకుంటున్న మహిళలు

చీరాల అర్బన్/వేటపాలెం: దీప కాంతుల మేళవింపు దీపావళి పండుగను ప్రజలు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. నియోజకవర్గంలోని చీరాల, వేటపాలెం మండలాల్లో ప్రజలు ఉత్సాహంగా జరుపుకున్నారు. దీపావళికి బాణసంచా సామగ్రి అమ్మకాలు జోరుగా జరిగాయి. స్థానిక ఎన్ఆర్‌పీఎం హైస్కూల్ గ్రౌండ్స్‌లో బాణసంచా దుకాణాలను ఏర్పాటు చేశారు. పండుగకు వారం రోజులు ముందే పండుగ హడావుడి కనిపించింది. ఆదివారం సాయంత్రం చీరాల ప్రాంతమంతా దీపాల వెలుగులుతో నిండిపోయింది. చిన్నా, పెద్దా అందరూ అందరూ కలిసి పండుగను జరుపుకున్నారు. దీపాలు, విద్యుత్ లైట్లు, బాణసంచాతో పట్టణమంతా వెలుగులు విరజిమ్మాయి. పేరాలలోని మదన గోపాలస్వామి దేవాలయంలో ఉత్సవమూర్తులను గజ వాహనంపై వీధుల్లో ఘనంగా ఊరేగించారు. అర్చకులు ఆర్‌వీ రంగాచార్యులు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని గ్రామాల్లో వీధివీధిన ప్రతి ఇంటి ముంగిట మహిళలు మట్టి ప్రమిదల్లో వెలిగించిన దీపాలతో పండగ శోభనిచ్చాయి. పండుగ రోజు ఉదయాన్నే ఇంటిల్లిపాది తలంటి స్నానాలు ఆచరించి మహిళలు ప్రత్యేకించి కుబేరస్వామి, వైభవలక్ష్మి నోములు నోచుకోన్నారు.

సందడి చేసిన యువత..


అద్దంకి/అద్దంకి రూరల్/బల్లికురవ/మేదరమెట్ల/జే.పంగులూరు: నరకాసురుడనే రాక్షసుడిని సంహరించిన మరుసటి రోజు అతడి పీడ వదిలిన ఆనందంలో ప్రజలు దీపావళి జరుపుకుంటారని పురాణాలు చెప్తున్నాయి. చీకటిని పారదోలుతూ వెలుగులు తెచ్చే పండుగగా, విజయానికి ప్రతీకగా దీపావళి పండుగను జరుపుకుంటారు. ఈ పండగను ప్రతి ఏడాది ఆశ్వయుజ అమావాస్య రోజున వస్తుంది. దీపాల పండుగకు ముందు రోజు ఆశ్వయుజ బహుళ చతుర్దశి, దీనిని నరక చతుర్దశిగా జరుపుకుంటారు. ఈ పండగ సందర్భంగా లక్ష్మి పూజ చేస్తారు. ప్రతి ఒక్కరూ నూతన వస్త్రాలు ధరించి దీపాలు వెలిగించి చిన్నపెద్ద తేడా లేకుండా పండుగను జరుపుకుంటారు.

స్వీట్లు, కొత్త బట్టలు, బాణసంచాతో హడావుడి..

చినగంజాం/మార్టూరు/యద్దనపూడి/కారంచేడు: దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని నియోజకవర్గంలో పలు దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆదివారం ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. మరి కొంతమంది సోమవారం పండుగను జరుపుకున్నారు. దుష్టశక్తులపై, దైవ శక్తి విజయం సాధించినందుకు ప్రతీకగా ప్రజలు పెద్ద ఎత్తున బాణసంచాలను కాల్చి తమ ఆనందాన్ని పంచుకోవడం ఆనవాయితీ. ఈ ఏడాది దీపావళి అన్ని వర్గాల ప్రజల్లో ఆనందాన్ని నింపింది. అన్నదాతలకు, ఆటోవాలాలకు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు, అమ్మఒడి, వైఎస్సార్ చేయూత ఇలా అన్ని వర్గాల ప్రజలు తమకు వచ్చిన రాయితీలతో ఆనందంగా పండుగను జరుపుకున్నారు. టపాసులు కాల్చి నరకాసుర వధను నిర్వహించారు. కారంచేడు చినవంతెన సెంటర్, కాలువ సెంటర్, పెద్దబజారు సెంటర్లలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో చిన్నారులు, పెద్దలు పెద్ద ఎత్తున బాణ సంచాలను కొనుగోలు చేశారు. స్వర్ణ, కుంకలమర్రు, దగ్గుబాడు, కొడవలివారిపాలెం, ఆదిపూడి, నాయుడువారిపాలెం, యర్రంవారిపాలెం గ్రామాల్లో ప్రజలు పెద్ద ఎత్తున బాణా సంచాలను కాల్చారు. మండలంలోని స్వర్ణ, చీరాల రోడ్డులోని కాకర్స్ గోదాముల వద్ద పెద్ద ఎత్తున బారులు తీరిన ప్రజలు మందుగుండు సామగ్రిని కొనుగోలు చేశారు.



చీరాలలో మదనగోపాలస్వామి నగరోత్సవం



కొణిదెనలో ఓ ఇంటి ముందు దీపాల వెలుగులో అమ్మవారు



కారంచేడులో దీపావళి పండుగలో చిన్నారులు

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



మహిళలకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

- గడప గడపలో ఏపీ శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

జే.పంగులూరు: పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం అని.. నాలుగున్నరేళ్లుగా రాష్ట్రంలో సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారులకు అందిస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని ఏపీ శాప్ నెట్ చైర్మన్, అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ బాచిన కృష్ణచైతన్య అన్నారు. మండల పరిధిలోని కశ్యాపురం గ్రామంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న కృష్ణచైతన్య మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో ఇదివరకు ఎవ్వరూ అమలు చేయలేని సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత మన సీఎం జగన్‌కే మాత్రమే దక్కుతుందన్నారు. పథకాల అమలు తీరు, పరిపాలనను గ్రామస్థాయికి తీసుకువచ్చి వచ్చిన జగనన్నను మరో మారు ముఖ్యమంత్రిగా చేయాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. చంద్రబాబు తను అధికారంలోకి వస్తే పేదలను కోటీశ్వరులను చేస్తాను అని చెప్పడం ఈ దశాబ్దపు అతిపెద్ద జోక్ అని ఎద్దేవా చేశారు. అధికారంలో ఉన్నప్పుడు పేదలను పట్టించుకోని చంద్రబాబు, అధికారంలోకి రావటానికి పేదలు ప్రజలను ఉద్దరిస్తానని చెప్తే రాష్ట్ర ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. ఈ సందర్భంగా కృష్ణచైతన్య పార్టీ నాయకులతో, కార్యకర్తలతో ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను గురించి వివరించారు. ముందుగా గ్రామంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామాంజినేయులు, ఎంపీపీ తేళ్ల నాగమ్మ, మండల కన్వీనర్, మండల ఉపాధ్యక్షుడు యర్రం శ్రీనివాసరెడ్డి, మండల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రాయిణి వెంకటసుబ్బారావు, సర్పంచ్ ధూళిపాళ్ల వెంకట్రావు, ధూళిపాళ నారాయణస్వామి, పెంట్యాల హరిబాబు, ధూళిపాళ చిరంజీవి, వెల్డి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల సమస్యలు పరిష్కరిస్తా

- నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి

మార్టూరు: మండలంలోని రాజుపాలెం గ్రామ సమస్యలను ఒక్కొక్కటి త్వరితగతిన పరిష్కరిస్తానని మాజీ ఎమ్మెల్యే, పర్చూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ హామీ ఇచ్చారు. గ్రామ పార్టీ సీనియర్ నాయకుడు తిరుపతి వెంకటవిష్ణు ఆధ్వర్యంలో ఎస్సీ కాలనీ వాసులు ఆదివారం ఇన్‌చార్జ్ ఆమంచిని ఆయన స్వగృహంలో కలిశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎస్సీ కాలనీలో తాగునీటి అవసరం కోసం ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయాలని, శ్మశాన స్థలాన్ని సర్వే చేయించి ఫెన్సింగ్, మెరక తోలించాలని, కాలనీలో డ్రైనేజీ నిర్మించాలని ఆమంచిని కోరారు. అందుకు సత్వరం స్పందించిన ఆయన త్వరలో సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు కొమెర శ్రీను, ఉయ్యాల బుజ్జి, వెల్లటూరి జేమ్స్, జిర్రా బాబు, ఆర్కే రవి, గోపతోటి పాలేరు, సుబ్బారావు, గొట్టిపాటి వీరవసంతరావు, వాసివల్లి రాము, వీరాంజి, శ్రీను, రాముడు తదితరులు పాల్గొన్నారు.



ఆమంచిని కలిసి సమస్యలు వివరిస్తున్న ఎస్సీ కాలనీవాసులు

అంజన్నకు అరటిపండ్లతో పూజ



అరటిపండ్లతో పూజలందుకున్న ప్రసన్నాంజనేయస్వామి

అద్దంకి రూరల్: పుణ్యక్షేత్రం శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామికి అమావాస్య సందర్భంగా సోమవారం పదివేల అరటిపండ్లతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీనిలో భాగంగా ఉదయం సుప్రభాతం, గోపూజ, బిందెతీర్థం, అభిషేకం కార్యక్రమం అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు. వేదపండితులు, అర్చకులు, ఉభయదాతలు వేద స్వస్తి మంగళ వాయిద్యాలతో ఆలయ ప్రదక్షిణ, వినాయక, సుబ్రమణ్య స్వామివారికి జీవధ్వజ ఉష్టవాహనానికి నారికేళ సమర్పణ చేశారు. తదుపరి 11 ఆవృత్తాలుగా పదివేల అరటి పండ్లతో పూజ నిర్వహించారు. ఉభయ దాతలు గుంటూరుకు చెందిన పీ శ్రీనివాసరావు, కుటుంబ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

విద్యాదాత బాపయ్యశెట్టి సేవలు అమూల్యం



బాపయ్య కాంస్య విగ్రహానికి నివాళులర్పించిన నాయకులు

వేటపాలెం: స్వాతంత్ర్యం రాక పూర్వమే వేటపాలెంలో విద్యా సంస్థ నెలకొల్పి ఎందరికో విద్య నందించిన విద్యాదాత బండ్ల బాపయ్య శెట్టి అని దేవాంగ కార్పొరేషన్ చైర్మన్ బీరక సురేంద్ర కొనియాడారు. స్థానిక బండ్ల బాయ్య విద్యా సంస్థల్లో విద్యా సంస్థల వ్యవస్థాపకుడు బాపయ్య శెట్టి వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా మండల పరిషత్ కార్యాలయాల ప్రాంగణంలో గల బాపయ్య శెట్టి కాంస్య విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తిరుమలాదేవి, సజ్జా హేమలత, చల్లా రామావరు, సజ్జా వెంకటేశ్వరరావు, కుర్మా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలతో వినోదం, విజ్ఞానం



బ్రోచర్ విడుదల చేస్తున్న వైస్ ఎంపీపీ సుబ్బారావు

కారంచేడు: గ్రంథాలయాలు ప్రజలకు, చిన్నారులకు, విద్యార్థులకు అవసరమైన వినోదంతో పాటు, విజ్ఞానాన్ని పెంపొందిస్తాయని వైస్ ఎంపీపీ యార్లగడ్డ సుబ్బారావు అన్నారు. సోమవారం ఆయన మండల కేంద్రం కారంచేడు గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 56వ గ్రంథాలయ మహోత్సవాలను పురస్కరించుకొని బ్రోచర్ విడుదల చేసి మాట్లాడారు. గ్రామాల్లో గ్రంథాలయాలు తప్పకుండా వినియోగించుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్, నాగయ్య పాల్గొన్నారు.

అద్దంకి: గ్రంథాలయాలు జీవన వికాసానికి మూలమని లైబ్రేరియన్ సుగుణరావు అన్నారు. గ్రంథాలయ 56వ వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక గ్రంథాలయంలో ప్రారంభ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 14 నుంచి 20 వరకు ఈ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

మహిళపై దాడి, కేసు నమోదు

చీరాల: మహిళపై దాడి చేసిన కేసులో ఓవ్యక్తిపై కేసు నమోదైంది. ఎస్సై జనార్దన్ వివరాల మేరకు.. చీరాల రూరల్ మండలం వాడరేవులో ప్రేమ్‌కుమార్ మద్యం తాగి వీధుల్లో హల్‌చల్ చేస్తున్నాడు. దీంతో ఫిర్యాది దుర్గ కుమారుడు శివాజీ అతడిని ప్రశ్నించడంతో దాడి చేయబోయాడు. దీంతో అతడు ఇంట్లోకి వెళ్లగా నిందితుడు ఇంట్లోకి ప్రవేశించి శివాజీ తల్లి దుర్గను దుర్భాషలాడాడు. కత్తితో బెదిరించి అక్కడ ఉన్న వస్తువులను ధ్వంసం చేశాడు. ఈ మేరకు బాధితురాలు ఈపూరుపాలెం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై కేసు నమోదు చేశారు.

నేడు కారంచేడులో 'మా నమ్మకం నువ్వే జగనన్న'

కారంచేడు: మండల కేంద్రమైన కారంచేడు–3 గ్రామ సచివాలయ పరిధిలో మంగళవారం 'మా నమ్మకం నువ్వే జగనన్న' కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీవో పీ లక్ష్మీనారాయణ తెలిపారు. ముందుగా నిర్ణయించిన ప్రకారం సాయంత్రం 3 గంటల నుంచి 5 గంటల వరకు గ్రామంలో నిర్వహించే కార్యక్రమానికి ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యురాలు, గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు హాజరవుతారని, సంబంధిత అధికారులు, సిబ్బంది తప్పకుండా హాజరు కావాలని ఆయన కోరారు.

బాలుడి అదృశ్యంపై కేసు



చీరాల: బాలుడు అదృశ్యంపై చీరాల ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం మిస్సింగ్ కేసు నమోదైంది. సీఐ శేషగిరిరావు వివరాల మేరకు.. చీరాల బాదంపాలు సెంటర్‌కు చెందిన 13 ఏళ్ల వయసు గల యల్లంపల్లి నాగరాజు దివ్యాంగుడు ఈనెల 8న ఆడుకోవడానికి బయటకు వెళ్లి ఇంటికి తిరిగిరాలేదన్నారు. ఆ రోజు నుంచి తల్లిదండ్రులు పరిసర ప్రాంతాలలో గాలించినా బాలుడి ఆచూకీ లభించలేదన్నారు. దీంతో తల్లిదండ్రులు సోమవారం ఒన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. బాలుడి వివరాలు తెలిసిన వారు ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో తెలియపరచాలన్నారు.

సత్ప్రవర్తనతో మెలిగితేనే భవిష్యత్

బల్లికురవ: రాబోయే ఎన్నికల దృష్ట్యా గ్రామాల వారీగా రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని బల్లికురవ ఎస్సై వీ. వేమన కోరారు. ఆదివారం బల్లికురవ పోలీసు స్టేషన్‌లో అంబడిపూడి గ్రామానికి చెందిన రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. గత ఎన్నికల్లో అల్లర్లకు పాల్పడటం వల్లే రౌడీ షీటర్లు బుక్ చేశామని, ప్రస్తుత పరిస్థితిలో ఏవిధమైన గొడవలకు వెళ్లకుండా ఉంటే ఉన్నత స్థాయి అధికారులకు నివేదిస్తామని చెప్పారు.